బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా వెంకటేష్



నియామకపత్రం అందుకుంటున్న ప్యారసాని వెంకటేష్

చార్మినార్: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా చార్మినార్‌కు చెందిన ప్యారసాని వెంకటేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ చేతుల మీదుగా ఆయన బుధవారం నియామకపత్రం అందుకున్నారు. ఇప్పటి వరకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్‌గా పని చేసిన ఆయనకు పదోన్నతి కల్పించి రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలతో పాటు కార్యాలయం ఇన్‌చార్జిగా కూడా బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో తనకు ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు.

పాఠశాలల్లో దోమల నివారణకు చర్యలు



గోల్కొండ: విష జ్వరాల నుంచి విద్యార్థులను కాపాడేందుకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో దోమల నివారణకు మందును స్ప్రే చేస్తున్నారు. గోల్కొండ ఎంటమాలజీ ఏఈ ఆదేశాల మేరకు సిబ్బంది బుధవారం గోల్కొండలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మందును స్ప్రే చేశారు.

1న 'నాట్య ప్రస్థానంలో ముఖ్య కల్పన' పై ఉపన్యాసం

సుల్తాన్‌బజార్: అభినయ దర్పణ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్య గురువు ప్రొఫెసర్ డాక్టర్ భాగవతుల సేతురామ్ వారి నాట్య ప్రస్థానంలో నృత్య రూపకల్పన అనే అంశంపై ఉపన్యాస ప్రదర్శన సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం 10 గంటలకు సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవారాయ తెలుగు భాషా నిలయంలో నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్లు ఓలేటి రంగమని, ఓలేటి రేఖ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ భాగవతుల సేతురామ్ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. గౌరవ అతిథిగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఈసీ సభ్యులు లయన్ నిర్మల ప్రభాకర్, డాక్టర్ ఆర్.ప్రసన్నారాణి, డాక్టర్ పి.రమాదేవి, వేలూరి సుమిత్ర, పార్థసారథి, డాక్టర్ యశోద, డాక్టర్లు హాజరు కానున్నట్లు తెలిపారు.

సన్మానం



డాక్టర్ సర్జీవ్ సింగ్ యాదవ్‌ను సన్మానిస్తున్న డాక్టర్ సిరాజ్ ఉర్ రెహ్మాన్, శ్రీధర్‌రెడ్డి

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా డెంటల్ ఆసుపత్రి ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ సర్జీవ్‌సింగ్ యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. ఉస్మానియా డెంటల్ కాలేజ్ ప్రొఫెసర్లు డాక్టర్ సిరాజ్‌ఉర్ రహ్మాన్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కార్పొరేట్ స్థాయికి దీటుగా ఉస్మానియా ప్రభుత్వ డెంటల్ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నామన్నారు.

శ్రీకృష్ణ వేషధారణ పోటీలు



అబిడ్స్: మంగళ్‌హాట్ పూసలబస్తీలో శ్రీకృష్ణ వేషధారణ పోటీలు జోరుగా నిర్వహించారు. నిర్వాహకులు, ఆర్కిటెక్ ఇంజినీర్ వాస్తుశిల్పి ఆవుల కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ ఆవుల అరుణల ఆధ్వర్యంలో కనుల పండువగా వేడుకలు చేపట్టారు. చూడ ముచ్చటగా చిన్నారుల వేషధారణలో విజేతలకు బహుమతులు అందజేశారు. మంగళ్‌హాట్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి ఈ వేడుకలను తిలకించారు.

పురస్కారం ప్రదానం

సుల్తాన్‌బజార్: బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్తులో బుధవారం ప్రసిద్ధ రంగస్థల సురభి కళాకారుని ఆలేటి జమున రాయులు 4వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఏటా అందించే జమున రాయులు స్మారక పురస్కారాన్ని కార్యక్రమ ముఖ్యఅతిథి రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి, బాపనపల్లి వెంకటస్వామికి అందజేశారు. అనంతరం జమున రాయలకు ఇష్టమైన శ్రీ సత్య హరిశ్చంద్ర నాటకం నుంచి కాటికాపరి దృశ్యాన్ని ప్రదర్శించారు. ఇందులో హరిశ్చంద్ర పాత్రను వారి మనువడు నిఖిలేష్ ధరించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమానికి అధ్యక్షుడిగా సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్‌రావు వ్యవహరించారు. బుర్ర సాయినాథ్, లంక లక్ష్మీనారాయణ, ఎం.గీతాలక్ష్మి పాల్గొన్నారు.

'గుడిమల్కాపూర్' చైర్మన్‌గిరీ దక్కేదెవరికో..?



- పెరిగిన ఆశావహులు
- 30 ఏళ్లుగా కష్టపడిన వారికా, పార్టీలు మారిన వారికా..?
- సందిగ్ధంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం

అబిడ్స్/గోల్కొండ: గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎవరికి దక్కుతుందో అంతుపట్టడం లేదు. 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్న నాయకులకా, లేకా ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులకు దక్కుతుందా అని కార్యకర్తలు, నాయకులు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ నాంపల్లి, కార్వాన్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధుల్లోకి వస్తుంది. రెండు నియోజకవర్గాల్లో 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకొని ఉన్న నాయకులకే మార్కెట్ కమిటీ చైర్మన్ ఇవ్వాలని రెండు నియోజకవర్గాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అంతేకాక పాతబస్తీ పరిధిలోని కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల్లో మైనార్టీలదే హవా కొనసాగుతోంది. మైనార్టీలకు చెందిన మైనార్టీ నాయకులకు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పగిస్తే మైనార్టీ వర్గాలకు న్యాయం జరుగుతుందని సర్వత్ర పేర్కొంటున్నారు. గతంలో రంగారెడ్డి జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. కాగా ప్రస్తుతం హైదరాబాద్ వాసులకే గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీని కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లు తెలుస్తుంది.

స్థానిక మైనార్టీలకే మొగ్గుచూపు..

మూడు, నాలుగు నెలల క్రితం పార్లమెంటు ఎన్నికల ముందు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీని నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాలకు చెందిన మైనార్టీ నాయకులకు ఇవ్వాలని పార్టీ అధిష్టానం నిర్ణయించినట్లు తీవ్రంగా చర్చ జరిగింది. పాతబస్తీలో మైనార్టీలకు పెద్ద పదవులు దక్కక పోవడంతో కనీసం గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ దక్కుతుందని ఎంతో సంబరపడిపోయారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గాంధీభవన్‌లో ఉంటూ నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాల్లో పార్టీ పటిష్టతకు నాయకులు ఎంతో కృషి చేశారు. 25, 30 ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్న తమకే గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ దక్కుతుందని ఎంతోమంది మైనార్టీ నాయకులు ఆశలు పెట్టుకొని ఎదురుచూస్తున్నారు. గత నెలలో ఎంతో మందిని చైర్మన్‌గా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గుడిమల్కాపూర్ మార్కెట్‌ను ప్రకటించలేదు.

ప్యారాచూట్ నాయకుల పైరవీల జోరు..

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీని నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాల సీనియర్ నాయకులకు దక్కుతుందని ఆశపడుతున్న సమయంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఒక నాయకుడు తనకే గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దక్కుతుందని జోరుగా ప్రచారం చేసుకుంటున్నాడు. కొన్ని నెలల క్రితం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన అతను నగరంలోని సంపన్న నియోజకవర్గాలకు చెందిన ఒక బడా మైనార్టీ నాయకుడితో కలిసి పైరవీలు మొదలు పెట్టాడు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరితే తనకెందుకు ఇవ్వరని పలువురు మంత్రుల దగ్గర పైరవీలు చేస్తున్నాడు. తనకే గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ దక్కిందని కూడా గాంధీభవన్‌తో పాటు పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ముందు పేర్కొంటుండడంతో సీనియర్ నాయకులంతా నిరాశ, నిస్పృహాలకు గురవుతున్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరినవారికి ఇస్తే రెండు నియోజకవర్గాల కార్యకర్తలు, నాయకులు తీవ్ర ఆగ్రహంతో ఆందోళన చేసేందుకు కూడా సిద్ధమంటున్నారు. రెండు నియోజకవర్గాల్లోనే అసలైన క్రమశిక్షణ గల నాయకులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి ఎలా ఇస్తారు..

బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి పదవులు అప్పగిస్తే తామెక్కడ పోవాలని నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ నుంచి వచ్చి పైరవీలు చేసే నాయకులను దూరం ఉంచాలని వారంటున్నారు. కష్టపడి పని చేసినవారికే ముఖ్యంగా మైనార్టీ ప్రాభల్యం ఉన్న రెండు నియోజకవర్గాల్లో మైనార్టీ నాయకులకే చైర్మన్ పదవి అప్పగించాలని పలువురు నాయకులు డిమాండ్ చేస్తున్నారు. పార్టీ అధిష్టానం, సీఎం రేవంత్‌రెడ్డికి కూడా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పైరవి నాయకులపై ఫిర్యాదు చేస్తామని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాక కాంగ్రెస్ పార్టీ ఆల్ ఇండియా అగ్ర నాయకులు కూడా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి పదవులు ఇవ్వొద్దని నిర్ణయించినట్లు సమాచారం. పార్టీ అగ్రనాయకత్వాన్ని తిరస్కరించి ఒకవేళ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను అప్పగిస్తే పెద్ద ఎత్తున నిరసనలు చేసి ఢిల్లీలోని పార్టీ అధిష్టానానికి కూడా ఫిర్యాదులు చేస్తామని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పేర్కొంటున్నారు.

బాధితులకు అండగా పోలీసులు



తెలంగాణ డీజీపీని కలిసిన మహ్మద్ జాహెద్

గోల్కొండ: బాధితులకు పోలీసులు ఎప్పుడూ అండగా ఉంటారని తెలంగాణ డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. మజ్లిస్ వికలాంగుల సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు గోల్కొండకు చెందిన మహ్మద్ జాహెద్ బుధవారం ఆయనను కలిశారు. తన చెల్లెలిని వరకట్నం కోసం ఆమె భర్తతో పాటు కుటుంబసభ్యులు వేధిస్తున్నారని ఈ విషయంలో తనకు సత్వర న్యాయం చేయాలని మహ్మద్ జాహెద్ డీజీపీని కోరారు. గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌తో మాట్లాడి కేసు వివరాలు తెలుసుకోని తప్పకుండా న్యాయం చేస్తామని డీసీపీ హామీ ఇచ్చారు.

30న నిలోఫర్‌లో బోనాలు

నాంపల్లి: నిలోఫర్‌లోని బంగారి లక్ష్మీదేవి ఆలయంలో 32వ శ్రావణ మాస అమ్మవారి బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఆలయ కమిటీ సభ్యులు ఆసుపత్రి ప్రాంగణంలో ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ సభను ఏర్పాటు చేశారు. ఈనెల 30న శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం జరుగుతుందని వారు తెలిపారు. భక్తులు అమ్మవారికి బోనాల సమర్పణ, తొట్టెల ఊరేగింపు జరుగుతుందని తెలిపారు.

వినాయక నవరాత్రులకు సహకరించండి



మాట్లాడుతున్న సౌత్‌వెస్ట్ డీసీపీ చంద్రమోహన్

విజయనగర్‌కాలనీ: గణపతి నవరాత్రుల్లో విఘ్నాలు కలుగకుండా ప్రజలంతా సహకరించాలని సౌత్‌వెస్ట్ డీసీపీ జి.చంద్రమోహన్ అన్నారు. వివిధ విభాగాల అధికారుల సమన్వయంతో ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వినాయక మండప నిర్వాహకులు, వివిధ విభాగాల అధికారులతో మంగళవారం రాత్రి ఆసిఫ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో డీసీపీ మాట్లాడారు. విగ్రహాల ప్రతిష్ఠాపనకు పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం అధికారికంగా డీడీ చెల్లించాలన్నారు. మండపాల వద్ద ఎల్లవేళల ఇద్దరు వలంటీర్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏసీపీలు వెంకట్‌రెడ్డి, ఫయాజ్, మునావర్, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



బస్తీ దవాఖానాను సందర్శించిన డీసీ శైలజా

యాకుత్‌పురా: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ సంతోష్‌నగర్ సర్కిల్ డీసీ శైలజా తెలిపారు. బుధవారం డీసీగా బాధ్యతలు చేపట్టిన ఆమె సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి బస్తీ దవాఖానాలు, యూపీహెచ్‌సీ కేంద్రలను సందర్శించారు. విష జ్వరాలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో విజృంభిస్తున్న వైరల్ ఫీవర్‌లను అరికట్టేందుకు కమిషనర్, జోనల్ కమిషనర్ల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దోమలను నివారించేందుకు బస్తీలు, కాలనీల్లో ఫాగింగ్ నిర్వహిస్తూ వ్యాప్తి చెందకుండా చూస్తున్నామన్నారు.

'జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తాం'



ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శివసేనారెడ్డి, జితేందర్ రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించబోతున్నట్లు తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి తెలిపారు. బుధవారం ఎల్బీస్టేడియంలో ఇంటర్ కాంటినెంటల్ పీఫాకప్పు 2024 ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోస్టర్, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గచ్చిబౌలి స్టేడియంలో జరగబోయే ఫుట్‌బాల్ క్రీడలకు నగరం ఆధిత్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇండియ, మారిసెస్ దేశాల మధ్య సెప్టెంబర్ 3వ తేదీ నుంచి జరుగనున్న పోటీలకు స్పోర్ట్స్ అథారిటీ తరపునా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో మంత్రులు, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు జితేందర్‌రెడ్డి, తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పాల్గుణ, క్రీడాశాఖ అధికారులు అనురాధ, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే మజ్లిస్ లక్ష్యం



గోల్కొండ: యువతకు ఉపాధి కల్పించడమే మజ్లిస్ లక్ష్యమని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మజ్లిస్ ఆధ్వర్యంలో ఈ నెల 31న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని బుధవారం ఆయన హకీంపేట్‌లోని తన కార్యాలయంలో వెల్లడించారు. అయన మాట్లాడుతూ..ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సూచనలతో ఈ నెల 31న కార్వాన్‌లోని మహబూబ్ ప్రైడ్ ప్యాలెస్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ మేళా ఉంటుందన్నారు. ఇంజినీరింగ్, ఐటీ, టెలికామ్, హాస్పిటాలిటీ, బీపీవో, లాగిజ్టిక్స్ తదితర రంగాల్లో ఈ జాబ్ మేళా ఉంటుందన్నారు. 10వ తరగతి నుంచి ఇంటర్, పట్టబద్రులు, పోస్టు గ్రాడ్యుయేట్స్ 18 ఏళ్ల పైబడి ఉన్న వారు ఈ జాబ్ మేళాకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9885500783, 885982121, 9177246070లలో సంప్రదించవచ్చు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

చార్మినార్: అమ్మవారి విగ్రహాల ధ్వంసం కేసులో నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, మాజీ చైర్మన్ రాకేష్ తివారీ డిమాండ్ చేశారు. రక్షాపురంలోని ఆలయాన్ని సందర్శించిన వారు దేవాదాయ శాఖ వెంటనే స్పందించి ఆలయాన్ని పునః నిర్మాణం చేయాలని కోరారు. రాజకీయ ఒత్తిడుతకు తలొగ్గకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సిటీ కోర్టులు: యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం నాంపల్లి క్రిమినల్ కోర్టులో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రాజావర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిబిరంలో బీపీ, షుగర్, 2డీఇకో, గుండె పరీక్షలతో పాటు జనరల్ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. న్యాయవాదులందరూ ఈ వైద్య శిబిరంలో పాల్గొని తమ ఆరోగ్య వివరాలను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ సీవీ శ్రీనాథ్, జాయింట్ సెక్రెటరి రమేశ్, బార్ అసోసియేషన్ మెంబర్స్ ఈశ్వర్ కుమార్, కుమార్ పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్

లంగర్‌హౌస్: గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని లంగర్‌హౌస్ ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ అన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులతో ఆయన బుధవారం లంగర్‌హౌస్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..చట్టానికి సహకరిస్తూ, భక్తి భావంతో భావితరాలకు మన పండుగల విశిష్టతను తెలియజేసేలా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. అర్ధరాత్రి ఊరేగింపులు ప్రారంభించి ప్రధాన రోడ్లపై మద్యం మత్తులో ఇతరులకు ఇబ్బంది కలిగేలా ఆడుతామంటే సహించేది లేదన్నారు. కొందరు గణేష్ మండపాల కోసం అనుమతి ఎందుకు తీసుకోవాలని అనుకుంటున్నారు.. ఇది అనుమతి కోసం కాదని, శాంతి భద్రతల పరిరక్షణ కోసమేనని ఆయన అన్నారు. జియోట్యాగ్, ఆన్‌లైన్ అనుమతి ఇచ్చి ఆర్టీఓ అధికారులతో మాట్లాడి అందరికీ వాహనాలు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రాఘవేంద్ర, రాజు నిర్వాహకులు ఇంద్రసేనారెడ్డి, నాగేంద్ర ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

'కేంద్రమంత్రి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం'

యాకుత్‌పురా: బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి వారి న్యాయవాదులకు కంగ్రాట్స్ అంటూ..బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల సమష్టి విజయమని కేంద్రమంత్రి సంజయ్ 'ఎక్స్'లో చేసిన వ్యాఖ్యలు న్యాయ వ్యవస్థ, న్యాయవాద వృత్తిపైన అవగాహన రాహిత్యమన్నారు. బాధ్యతయుతమైన పదవిలో కొనసాగుతూ న్యాయవ్యవస్థపై చేసిన వ్యాఖ్యలు సరైనవి కావాన్నారు.

దైవభక్తితోనే మానసిక ప్రశాంతత



గరికపాటి నర్సింహారావును సన్మానిస్తున్న దేవర వంశీ

గోల్కొండ: దైవ భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పద్మశ్రీ గరికపాటి నర్సింహారావు అన్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని బుధవారం ఆయన గుడిమల్కాపూర్‌లోని తాళ్లగడ్డ హనుమాన్ ఆలయంలో ప్రవచన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దైవభక్తికి మించింది మరేది లేదన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు దేవర వంశీ ఆయనను సన్మానించారు.

మురుగు కాలువను పూడ్చారు.. బస్తీని ముంచారు..

- డిస్పెన్సరీ మేలు కోసం రాత్రికి రాత్రే కాలువ పూడ్చివేత
- దారి మళ్లింపు జరగకుండా కాలువ పూడ్చివేతపై స్థానికుల ఆగ్రహం
- ఇంజినీరింగ్ విభాగం అధికారుల తొందరపాటుతో నీట మునిగిన బస్తీ



మురికినీటిలో పాఠశాల గల్లీ బస్తీ

నాంపల్లి: రాత్రికి రాత్రే ఓ మురుగు కాలువను పూడ్చివేయడంతో మురుగునీరంతా ఓ బస్తీని నీట ముంచేసింది. మెహిదీపట్నం సర్కిల్–12 జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు చేసిన తప్పిదానికి పేదలందరూ బాధను అనుభవిస్తున్నారు. నాంపల్లి నియోజకవర్గంలోని ఓల్డ్ మల్లేపల్లిలోని పాఠశాల గల్లీ ఉంది. ఈ బస్తీలో సుమారు 60 కుటుంబాలు ఉంటాయి. ఈ బస్తీలోని డ్రైనేజీ నీరు పాఠశాల గల్లీ వీధి నుంచి పాత ముంబాయి హైవే దాటుకుని ఓ ప్రైవేట్ డిస్పెన్సరీ మీదుగా ప్రవహించి అఫ్జల్‌సాగర్ మురుగు నాలాలో కలుస్తుంది. ఈ మురుగు కాలువను స్థానికులు ఆక్రమించేశారు. ఈ ఆక్రమణల ద్వారా మురుగునీటి సమస్య జఠిలం అవుతోంది. ఫలితంగా ప్రైవేట్ డిస్పెన్సరీలో రోజు డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. రోగులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ సమస్య సదరు డిస్పెన్సరీ యజమానికి నచ్చలేదు. ఎలాగైనా డ్రైనేజీ కాలువను దారి మళ్లించాలని ఆలోచించారు. అనుకున్నదే తడవుగా స్థానిక నేతలతో సంప్రదింపులు చేశారు. స్థానిక నేత సహాయంతో జీహెచ్‌ఎంసీ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. రాజకీయ నేతల ఒత్తిడితో ఇంజినీరింగ్ విభాగం అధికారులు మురుగు కాలువను రాత్రికి రాత్రే అడ్డుకట్ట వేశారు. మురుగు కాలువను దారి మళ్లించకుండానే పూడ్చివేయడంతో కాలువలోని నీరంతా పాఠశాల గల్లీ బస్తీలోకి వచ్చేశాయి. ఈ మురుగునీరు ఇళ్లల్లోనికి రావడంతో స్థానికులు ఏమి చేయాలో దిక్కు తోచని పరిస్థితి నెలకొంది. సమస్య నుంచి బయటపడేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించిన దాఖలాలు లేవు.

మురుగు నిలువకుండా చూస్తాం..

ఈ విషయమై వార్డు 11 ఇంజినీరింగ్ విభాగం డీఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా డ్రైనేజీ కాలువను పూడ్చివేసిన విషయం వాస్తవమే అన్నారు. బస్తీని మురికినీటి నుంచి విముక్తి కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసే పనిలో ఉన్నట్లు వివరించారు. మురికినీటి కాలువ రూటు మార్పి త్వరలోనే మురుగునీరు నిలువకుండా చూస్తామని చెప్పారు.

రైలులో మరిచిపోయిన బ్యాగు అందజేత

నాంపల్లి: తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికుడు మరిచిపోయిన ఓ బ్యాగును ఆర్‌పీఎఫ్ పోలీసులు బాధితుడికి అందజేశారు. ఈ ఘటన హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..రంగారెడ్డి జిల్లాకు చెందిన బిట్టుకుమార్ ఈనెల 27న ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు రైలులో వచ్చారు. రైల్వే స్టేషన్‌లో దిగిన ప్రయాణికుడు తన బ్యాగును మరిచిపోయి వెళ్లిపోయారు. కొంతసేపటికి తన బ్యాగును రైలులోనే మరిచిపోయినట్లు తెలుసుకున్నారు. వెంటనే ఆర్‌పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు వెంటనే బోగీలో లభించిన రూ.లక్ష విలువైన వస్తు సామగ్రి ఉన్న బ్యాగును అందజేశారు.